నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | మార్చి 17, 2024 | www.navatelangana.com

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న చిప్ప దుర్గాప్రసాద్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో దివ్యాంగుల సంక్షేమం కోసం 29వ అంశం రూ.6000 పెన్షన్ పెంపు, ఉచిత బస్సు ప్రయాణం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు, ఉన్నత ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, 2016 దివ్యాంగుల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రంగ్యానాయక్, బంటు స్వామి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినీనటి రాశీఖన్నా సందడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలో సినీనటి రాశీఖన్నా సందడి చేశారు. ఓ ఆస్పత్రిలో రోబోటిక్ వైద్య సేవలను ప్రారంభించేందుకు వచ్చి అలరించారు. ఈ సందర్భంగా ఆమెను చూసేందుకు, సెల్ఫీ దిగేందుకు ఆమె అభిమానులు పోటీపడ్డారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాశీఖన్నా

మోగిన ఎన్నికల నగారా

- లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- అమల్లోకి ఎన్నికల కోడ్
- రాష్ట్రంలో మే 13న పోలింగ్.. జూన్ 4న రిజల్ట్
- వేసవి ఎండలతో పాటు హీటెక్కనున్న రాజకీయాలు
- జహీరాబాద్‌లో ప్రధాన పార్టీలకు అభ్యర్థుల ఖరారు
- నిజామాబాద్‌కు కాంగ్రెస్ మినహా.. మిగతా పార్టీలకు అభ్యర్థుల కేటాయింపు



నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ఎన్నికల పండుగ వచ్చింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరగనుంది. అయితే రాష్ట్రంలో ఏప్రిల్ 14వ తేదీనా నోటిఫికేషన్ విడుదల చేయనుండగా, 25వ తేదీ వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. 26న నామినేషన్‌లను పరిశీలించనుండగా, 29వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు విధించారు. మే 13న పోలింగ్ పోలింగ్ జరగనుంది. జూన్ 4వ తేదీనా దేశ వ్యాప్తంగా ఒకే సారి ఫలితాలు విడుదల కానున్నాయి. అయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జహీరాబాద్‌కు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇది వరకే ఖరారు కాగా.. నిజామాబాద్‌కు కాంగ్రెస్ మినహా.. బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో విగ్రహాలకు ముసుగు పడింది.

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదల అయింది. దీంతో ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచార ప్రణాళికలు, గెలుపే లక్ష్యంగా రంగంలోకి దిగనున్నాయి. ఇది వరకే జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ నుంచి సురేశ్‌కుమార్ షెట్కార్, బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్, బీజేపీ నుంచి బీబీ పాటిల్‌కు టికెట్‌లు ఖరారు అయ్యాయి. అయితే నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు. బీఆర్ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ బరిలో నిలవనుండగా, బీజేపీ నుంచి అరవింద్ మరోసారి బరిలో నిలిచారు.

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో..

నిజామా బాద్ పార్లమెంట్ స్థానం 1952వ సంవత్సరంలో ఏర్పడింది. 17 సార్లు ఎన్నికలు జరగగా, అత్యధికంగా 11 సార్లు కాంగ్రెస్ అభ్య ర్థులు గెలుపొందగా, గడ్డం గంగారెడ్డి టీడీపీ నుంచి మూడు సార్లు, బీఆర్ఎస్, బీజేపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఒక్కోసారి గెలుపొందారు. దీని పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్‌తో పాటు జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ బోధన్‌తో పాటు నిజామాబాద్ రూరల్ కైవసం చేసుకోగా, బీఆర్ఎస్ బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల స్థానాల్లో గెలుపొందింది. నిజామాబాద్ అర్బన్‌తో పాటు ఆర్మూర్ నియోజక వర్గం నుంచి బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. ఏకపార్టీకి మద్దతు లేకుండా అన్ని పార్టీల నుంచి అభ్యర్థులు గెలుపొందడంతో లోక్‌సభ ఎన్నికపై ప్రధాన పార్టీలు దృష్టిసారించాయి. ఎలాగైనా లోక్‌సభ స్థానం కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతున్నాయి. కాంగ్రెస్ నుంచి ఇంకా అభ్యర్థి ఖరారు కాలేదు. అయితే బీఆర్ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ నుంచి ధర్మపురి అరవింద్ బరిలో నిలవనున్నారు.


బాజిరెడ్డి గోవర్ధన్


ధర్మపురి అరవింద్

జహీరాబాద్‌లో..

జహీరాబాద్ గత ఎన్నికల్లో రెండు సార్లు బీఆర్ఎస్ నుంచి బీబీపాటిల్ గెలుపొందగా.. తాజాగా ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకొని ఆ పార్టీ నుంచి బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్ బరిలో నిలిచారు. ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులను ఇది వరకే ఖరారు చేయడంతో వారు ప్రచారంలోకి దిగనున్నారు. గెలుపే లక్ష్యంగా పార్టీలో చేరికలు పెంచుతున్నారు. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వాటిల్లో కామారెడ్డి జిల్లా నుంచి కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్‌తో పాటు సంగారెడ్డి జిల్లా నుంచి నారయణ్‌ఖేడ్, అంధోల్, జహీరాబాద్ స్థానాలు ఉన్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నిక ల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా నాలుగు స్థానాలైన జుక్కల్, ఎల్లారెడ్డి, నారాయణ్‌ఖేడ్, అంధోల్ స్థానాల్లో గెలుపొందగా, బీఆర్ఎస్ బాన్సువాడ, జహీరాబాద్‌లో, కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి గెలుపొందారు. అత్యధిక స్థానాలు కాంగ్రెస్ గెలుపొందడంతో లోక్‌సభ స్థానాన్ని ఎట్టిపరిస్థితుల్లో కైవసం చేసుకోవాలని ఆ పార్టీ ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇటీవల పెద్దఎత్తున ఇతర పార్టీ నుంచి ఆ పార్టీలో నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారు.


సురేశ్ శెట్కార్


అనిల్‌కుమార్


బీబీ పాటిల్


అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఎన్నికల విధులను పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

పార్లమెంట్ ఎన్నికలలో అధికారులు తమ ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నోడల్ అధికారుల సమావేశంలో కలెక్టర్ హాజరై మాట్లాడుతూ.. ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లఘనలపై తీసుకోవాల్సిన చర్యలపై నోడల్ అధికారులతో సమీక్షించారు. పార్లమెంట్ ఎన్నికలను భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికి సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల పరిశీలక బృందాలు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ప్రజా ప్రాతినిధ్యం చట్టంలోని సెక్షన్ 28 ప్రకారం మనమంతా భారత ఎన్నికల కమిషన్ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మనం ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, మన పారదర్శకత ప్రతి అంశంలో స్పష్టంగా కనిపించాలన్నారు. ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు. గోడలపై ఉన్న రాజకీయ పార్టీల వాల్ పోస్టర్లు, కటౌట్లు తొలగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలలో రాజకీయ నాయకులు ఫోటోలు, క్యాలెండర్లు తక్షణమే తొలగించాలని తెలిపారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు కప్పి ఉంచాలని కోరారు. మున్సిపల్, రెవిన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీను గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమని, సి-విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నెంబర్, ఇతర మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే మన లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలని అన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలని అన్నారు. అక్రమ నగదు, మద్యం పంపిణీ జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు రాజారాం, బావయ్య, మురళీకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్, రఘునాథ్, ఏవో మసూర్ అహ్మద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఇద్దరు మృతి

- వివాహానికి వెళ్లొస్తూ విషాదం
- పలువురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-లింగంపేట్




బోల్తాపడ్డ ఆటో.. ఘటనా స్థలంలో క్షతగాత్రులు

వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో విషాదం నెలకొంది. ఆటో బోల్తా పడి ఇద్దరు మృతిచెందగా.. పలువురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన లింగంపేట్ మండలంలోని బాయంపల్లి గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలంలోని సింగీతం, గున్కుల్, వడ్డేపల్లి గ్రామానికి చెందిన పలువురు బంధువులు ఆటోలో లింగంపేట్ మండలంలోని కోర్పోలు గ్రామంలో శనివారం తమ బంధువుల వివాహ వేడుకకు హాజరైయ్యారు. తిరుగు ప్రయాణంలో బాయంపల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి రోడ్డు కిందికు పల్టీ కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న సింగీతం గ్రామానికి చెందిన గౌడ గారి సంగయ్య (66) అక్కడికక్కడే మృతి చెందాడు. లాలవ్వకు తీవ్ర గాయాలు కాగా.. ఎల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. ముగ్గురు చిన్నారులతో సహా.. 9 మందికి గాయాలు అయ్యారు. గుల్కుల్ వడ్డేపల్లి సింగీతం గ్రామానికి చెందిన బాలమణి, సతీష్, సాయవ్వ, పోచవ్వ, కవితతో పాటు ముగ్గురు చిన్నారులకు మొత్తం 9 మందికి తీవ్ర గాయాలు కాగా వారు ప్రస్తుతం ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆటోలో 12 మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

హడలెత్తించిన వడగండ్లు

- పొట్టపోసుకునే దశలోని వరికి తీవ్రనష్టం
- సిరికొండలో నేలవాలిన వరి.. కొట్టుకుపోయిన ధాన్యం

నవతెలంగాణ-విలేకరుబృందం


సిరికొండలో వడగండ్లు, ఈదురుగాలుల ధాటికి నేలకొరిగిన వరి


రామారెడ్డిలో వడగండ్ల వాన

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి మేఘాలు కమ్ముకోగా.. సాయంత్రం వేళ ఒక్కసారి భారీ వర్షం కురిసింది. సిరికొండ, రామారెడ్డి, మద్నూర్ తదితర మండలాల్లో వడగండ్ల వాన హడలెత్తించింది. అరగంట పాటు భారీ వర్షం కురవడంతో జనజీవనం అతలాకుతలమైంది. ఒక్కసారిగా కురిసిన వడగండ్ల వాన రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వరి పాలు పోసుకునే దశ, పొట్ట దశలో ఉండటంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. సిరికొండ మండలంలో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోగా.. వరిపైరు నేలకొరిగింది.

నేలకొరిగిన వరి.. కొట్టుకుపోయిన ధాన్యం

సిరికొండ : సిరికొండ మండలంలోని పలు గ్రామాలలో వడగండ్ల వానతో చేతికొచ్చిన వరి పంట వడ్లు రాలిపోవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. ఈదురు గాలులకు తోడు వడగండ్లు కురవడంతో కోతకు వచ్చిన వరి పంట రాలిపోయి నెలకొరిగింది. ఆరుగాలం కష్టం చేస్తే చేతికొచ్చిన పంట అర్ధంత రంగా రాలిపోవడం తో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. కొన్ని ప్రాంతాలలో కోసిన పంట వర్షపు నీటిలో కొటు కుని పోయింది. మోకాళ్ల లోతు నీరు పొలాల్లో చేరాయి. కోతలకు సిద్ధంగా ఉన్న పంట రాలిపో యి కోయడానికి వీలు లేకుండా పోయింది. జొన్న, మొక్కజొన్న పంట లు నెలకొరి గాయి. పంటలు చేతి కొచ్చే సమయంలో అకాల వర్షం తమను ముంచిందని రైతులు వాపోతున్నారు. అధికారులు నష్టం అంచనా వేసి ప్రభుత్వా నికి నివేదించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


సిరికొండలో కొట్టుకుపోయిన ధాన్యం


రామారెడ్డిలో వడగండ్లు

పొట్టపోసుకునే దశలో వరికి తీవ్రనష్టం

రామారెడ్డి : అకాల వడగండ్ల వర్షంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా కురిసిన వడగండ్ల వానతో పాలు పోసుకునే దశ, పొట్ట దశలో ఉన్న వరి దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ మరో మూడు రోజులు వర్షాలు ఉన్నాయని ప్రకటించడంతో రైతులు వడగండ్ల వానలు కురుస్తాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మద్నూర్ : మద్నూర్‌లో సాయంత్రం 6:30 గంటల సమయంలో ప్రారంభమైన వడగళ్ల వాన దాదాపు అరగంట పాటు హడలెత్తించింది. ఒక్కసారిగా వడగళ్ల వాన గాలి దుమారంతో ప్రజలు పరేషాన్ అయ్యారు. శివారు ప్రాంతంలో చేతికి వచ్చిన పలు పంటలు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కపోతకు ఉపశమనం

ఆర్మూర్ : గత కొద్ది రోజుల నుండి ఎండ వేడిమితో తల్లడిల్లిన ప్రజలు.. అరగంట పాటు కురిసిన అకాల వర్షంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. ఉరుములు మెరుపులతో వర్షం కురవగా ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ శాఖ అధికారులు కరెంటును సరఫరా నిలిపివేశారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

కంఠేశ్వర్ : నగరంలో సాయం త్రం 6.40 నిమిషాల నుంచి 7.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమ యమై య్యాయి. విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపి వేయడంతో చిమ్మ చీకట్లు అలుముకున్నాయి.


స్టెప్స్ షోరూంలో అగ్నిప్రమాదం

నెహ్రూపార్క్‌లోని స్టెప్స్ షోరూంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పిడుగుపడిందా.. లేకుంటే షార్ట్‌సర్క్యూట్ తో ఘటన చోటుచేసుకుందా అని అగ్నిమాపక సిబ్బంది విచారణ చేపట్టారు. మంటలు అంటుకోవడంతో ఫైర్ సిబ్బంది వచ్చి ఆర్పివేసే ప్రయత్నం చేశారు. లోపలికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో నిచ్చెనతో ఎక్కి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆ సమయంలో సిబ్బందితో పాటు కస్టమర్‌లు సుమారు 80 మంది షోరూంలో చిక్కుకుపోయారు.

రాజకీయ కక్షతోనే కవిత అరెస్ట్

- బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- మోడీ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-లింగంపేట్(ఎల్లారెడ్డి)/కామారెడ్డి

కావాలని రాజకీయ కుట్రలో భాగంగా బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీయడానికి బిజెపి, కాంగ్రెస్ కుట్రతోని ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రాల్లో శనివారం నిరసన చేపట్టి మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం, పీఎం డౌన్‌డౌన్ అని నినాదాలు చేశారు. ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, కామారెడ్డిలో మాజీ విప్ గంపగోవర్ధన్ మాట్లాడారు.


ఎల్లారెడ్డిలో మోడీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

తెలంగాణలో బిజెపి పార్టీ మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకొని రాష్ట్ర రాజకీయపై పట్టు సాధించేందుకు బిఆర్ఎస్‌ను బలహీనపరిచి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడానికి అరెస్టు చేశారన్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు పూర్తిగా అప్రజాస్వామికం అన్నారు. రాజకీయ కుట్రలో భాగమన్నారు. ఎల్లారెడ్డిలో మున్సిపల్ చైర్మన్ కురుమల సత్యనారాయణ, జడ్పీటీసి ఉషాగౌడ్, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు, పార్టీ మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, ఆయా మండల అధ్యక్షులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొనగా, కామారెడ్డి లో జిల్లా అధ్యక్షులు ఎంకే ముజాబుద్దీన్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పరీకి కుమార్, రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాలరావు, లోయలుపల్లి నర్సింగ్ రావు, కామారెడ్డి నియోజకవర్గ అధికార ప్రతినిధి గైని శ్రీనివాస్‌గౌడ్, 47వ వార్డు కౌన్సిలర్ గిరిగంటి స్వప్న లక్ష్మీనారాయణ, మహిళా నాయకురాలు లలిత తదితరులు పాల్గొన్నారు.

తాండాల్లో తాగునీటి సమస్య రావొద్దు

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నవతెలంగాణ-జుక్కల్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మండలాలలోని గ్రామాలలో గిరిజన తాండాలలో ఎక్కడా కూడా నీటీ ఎద్దడి తలెత్తకుండా వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటీపారుదల శాఖ (ఆర్‌డబ్ల్యుఎస్) అధికారులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ సూచించారు. శనివారం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం లోని అన్ని మండలాల ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, డీఈతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సమస్యలను గుర్తించి వాటిని రెండు రోజులలో పూర్తి చేయాలని, ఎక్కడా కూడా నీటి సమస్య ఉందని ఫిర్యాదు రావద్దని, ముందుగానే గుర్తించి పరిష్కరించాలని లేకుంటే చర్యలు తప్పవని అన్నారు. అవసరం ఉన్న చోట గుర్తించిన గ్రామాలలో వెంటనే బోరు బావి తవ్వించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ, జుక్కల్ ఏఈ నయూమ్, నియోజకవర్గంలోని వివిధ మండలాల ఏఈలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కట్టుకాలువ పూడికతీత పనులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని కట్టుకలువ పూడికత పనులను శనివారం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన రైతులకు వరప్రదాయమైన కట్టు కాలువ గత కొన్ని సంవత్సరాలుగా పూర్తిగా చెత్తాచెదారం చేరుకొని మట్టితో నిండిపోయిందన్నారు. దీంతో చెరువుల్లోకి నీరు చేరడం కష్టంగా మారిందన్నారు. ఆయకట్టు రైతులు పంటలు సాగు చేయలేక ఉన్న భూములను వట్టిగా వదిలేశారని తెలిపారు. వర్షాకాలం వస్తే కట్టు కాలువలో చెత్త పేరుకుపోవడంతో మట్టి పేర్కొని ఉండడంతో నీరన్ని వృథా అవుతున్నాయన్నారు. గతపాలకులు పట్టించుకోకపోవడంతో ఈ విషయమై ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకురాగా వెంటనే సానుకూలంగా స్పందించి రైతులను దృష్టిలో ఉంచుకొని కాల్వ పూడికత పనులు చేపట్టాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు, కాంగ్రెస్ నాయకులు పతి యుద్దీన్, డాక్టర్ రాజు దురిశెట్టి అశోక్, కౌడరవి, బైరయ్య, భాస్కర్‌గౌడ్, వినోద్ ఏదుల్, కుమ్మరి రాజు, నరేష్, పరశు రాం, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జలంగౌడ్, చిన్నారెడ్డి, బక్కన్న, కాంగ్రెస్ నాయకులు, ఐకెపి సీనియర్ సిసి పురస్తు నరేష్, వీవోఏ రత్నాకర్‌గౌడ్, సుమారు 300 మంది మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ



క్రీడా దుస్తులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కొత్తూరు వేణుగౌడ్ క్రీడా దుస్తులను వితరణ చేశారు. ఈ క్రీడా దుస్తులను ప్రధా నోపాధ్యాయుడు పురుషోత్తమా చారి, మాజీ ఎస్ఎంసి చైర్మన్ సత్యనారాయణ చేతుల మీదుగా అందజేసినట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

- బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని, ఇందుకుగానూ రానున్న కాలంలో ప్రభుత్వ బడిలో అత్యధికంగా బాల బాలికలను పెంచే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, అందుకు గ్రామస్తులు కూడా సహకరించాలని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఏఆర్పి క్యాంపు గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి అమెరికాలో స్థిరపడ్డ ఎడమకంటి కృష్ణారెడ్డి పూర్వ విద్యార్థి రూ.లక్ష వ్యయంతో గణిత శాస్త్ర ల్యాబ్‌ను అందజేశారు. దీనిని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నా మన్నారు. గ్రామస్తులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠ శాలలో చది వించాలని సూచి ంచారు. వచ్చే విద్య సంవత్సరం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని అన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న పాఠశాల కమిటీలు కూడా సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ అధికారులను బెదిరిస్తే తాము ఊరుకునేది లేదని అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. అధికారులు కూడా బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మైనారిటీ యువకులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, మండలాధ్యక్షుడు పులి శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి బొబ్బిలి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, తాజా మాజీ సర్పంచ్ అలేఖ్య మహేష్‌గౌడ్, గ్రామపెద్దలు రాజశేఖర్, మామిడి నాంపల్లి, రాజేశ్వర్, శివ కుమార్ తదితరులున్నారు.

జీపీ కార్యదర్శిపై దాడి



దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అంబం (వై) గ్రామపంచాయతీ కార్యదర్శి ఓ వ్యక్తి కుర్చీతో కొట్టి దాడికి పాల్పడ్డాడు. వెంటనే తేరుకున్న ఎంపీడీఓ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు తాగిన మత్తులో ఉన్న సరాఫ్ పవన్ కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సెక్రెటరీ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గాయాలపాలైన సెక్రెటరీని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గోపాల కృష్ణ మాట్లాడుతూ... అంబం గ్రామానికి చెందిన సరాఫ్ పవన్ కుమార్ అనే వ్యక్తి ఉదయం తమ సెక్రెటరీని వీధి దీపం కోసం అడగగా రెండు రోజుల్లో పెట్టిస్తామని చెప్పాడని తెలిపారు. అయితే మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సెక్రెటరీ శ్రీనివాస్‌తో తాను చర్చిస్తూ ఉండగా సరాఫ్ పవన్ కుమార్ తాగిన మైకంలో ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చాడని తన ముందే తమ సిబ్బందైన సెక్రెటరీ శ్రీనివాస్‌పై కుర్చీతో దాడికి పాల్పడ్డాడని అన్నారు.

హెగ్డోలి గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని హెగ్డోలి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ రూ.10లక్షలు నిధుల ద్వారా సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, హెగ్డోలి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వారికే మా మద్దతు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ చివరి దశకు వచ్చిందని, అందుకు కృషి చేస్తున్న బిజెపికే ఎమ్మార్పీఎస్ మద్దతు ఉంటుందని జిల్లాలోని మాదిగలు అందరూ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు సరికెల పోశెట్టి మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, విహెచ్పిఎస్, ఎంఎంఎస్, ప్రజాస్వామిక వాదులు అందరూ బీజేపీకి అండగా నిలబడి కమలం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిజామాబాద్ టౌన్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు పెద్దిగారి మహేష్ సభ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టౌన్ ఉపాధ్యక్షులు తలపాక సుమన్ ఎం ఎస్ పి జిల్లా నాయకులు యాద శ్రీ రాములు టౌన్ కార్యదర్శి ఐలపాక సుమన్ మాదిగ , సంజీవ్, రాంచందర్ శేఖర్ యాదగిరి నవీన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఉచిత కంటి వైద్య పరీక్షలు

- ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా పల్లెల్లో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంటి వైద్య శిబిరం క్యాంప్ ఇంచార్జ్ హనుమంతరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో హున్సా, మందర్న, ఖాజాపూర్, సాలూర, తగ్గెల్లి, ఫతేపూర్ గ్రామాలలో గత ఐదు రోజుల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శనివారం సాలూర క్యాంప్ గ్రామంలో ఈ వైద్య శిబిరాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇప్పటికే ఎందరికో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి నిరుపేదలకు ఉచిత మోతి బిందు ఆపరేషన్లు, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రతిరోజు ఒక్కొక్క గ్రామంలో ఈ కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నిరుపేద రోగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శనివారం సాలూరు క్యాంప్ గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పంచాయతీ కార్యదర్శులు రాధా రాణి, సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

- 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్



మాట్లాడుతున్న విద్యాధికారి రాజేశ్వర్

నవతెలంగాణ-బాల్కొండ

ఈనెల 18వ తేదీ నుంచి 30 వరకు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పదిపబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. బాల్కొండ మండలంలో అన్ని యాజమాన్యాలలోని 14 పాఠశాలల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 554 మంది విద్యార్థులు ఈఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో బాలురు 235 మంది, బాలికలు 319 మంది పరీక్షలు రాయనున్నారు. బాల్కొండ మండలంలోని 3పరీక్ష కేంద్రాలకు ప్రత్యేక చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను, సి సెంటర్ కస్టోడియలను, ఇన్విజిలేటర్స్‌ను నియమించినట్టు ఎంఈఓ తెలిపారు. యాజమాన్యాల వారీగా పరిశీలిస్తే ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలల్లో ప్రభుత్వ పాఠశాలలే ఉన్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశామని, తరగతి గదుల్లో ఆధునిక ఫర్నీచర్, విద్యుద్దీకరణ, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి వసతులు పూర్తిస్థాయిలో కల్పిం చటంతో ప్రభుత్వ పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్టు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ అన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం12:30 గంటల వరకు పరీక్ష సమయం నిర్ణయించబడింది. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్సు, కాంపోజిట్ తెలుగు కోర్సు రాసే విద్యార్థులకు మరో 20 నిమిషాల సమయం అదనంగా ఇవ్వనున్నారన్నారు. 5 నిమిషాలు ఆలస్యంగా అనగా ఉదయం 9.05 వరకు విద్యార్థులు పరీక్షకేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. విద్యార్థులందరికీ ఇప్పటికే హాల్ టికెట్లను ఇచ్చామని www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి కూడా హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, పరీక్ష కేంద్రాలను ముందుగానే తెలుసుకొని ఒక గంట ముందుగా విద్యార్థులందరూ పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సిందిగా మండల విద్యాశాఖ అధికారి సూచించారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాసేందుకు అన్ని పరీక్ష కేంద్రాలలో వైద్య బృందాల ఏర్పాటుతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని, విద్యార్థులందరూ కూడా వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిందిగా కోరారు. పరీక్షా సమయం పూర్తయ్యే వరకు విద్యార్థులు పరీక్షా హాల్‌లోనే ఉండాలని, పరీక్ష మధ్యలో బయటకు అనుమతి ఉండదని మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు.

రూరల్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డిని జక్రాన్‌పల్లి యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వినోద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

స్వయంభు శివ తీర్థ శ్రీ వెంకటేశ్వర నూతన ఆలయ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామంలో గల స్వయంభు శీలా తీర్థ శ్రీ వెంకటేశ్వర నూతన ఆలయ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ ఆలయ కమిటీ చైర్మన్‌గా కాటిపల్లి సాయిరెడ్డి, వైస్ చైర్మన్‌గా పుష్పక్, సెక్రెటరీ గాదపెల్లి గంగారాం, క్యాషియర్ కుమ్మరి సంతోష్‌ను నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ఉత్కం శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కనక రవి, యువజన విభాగం మండల ఉపాధ్యక్షులు కిషోర్, వినోద్, యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో రూ.20లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామంలో రూ.20లక్షల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీల పనులను అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు శనివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో అన్నివర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన అభయహస్తం 6 గ్యారంటీల హామీలలో 5హామీలను నెరవేర్చిందన్నారు. ఉప్లూర్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంలో ముఖ్య పాత్ర పోషించడంతో పాటు బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్, ఎంపీటీసీ సభ్యుడు పిప్పెర అనిల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, డీసీసీ డెలిగేట్ తక్కురి దేవేందర్, సీనియర్ నాయకులు పాలేపు నర్సయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, డాక్టర్ గోపాల్, కోడిమ్యాల సత్యగౌడ్, సరసం చిన్నారెడ్డి, రవి, మోకిమ్, శేఖర్, ఆంజనేయులు, మారుపాక నరేష్, చిలుకూరి నవీన్, బోనగిరి లక్ష్మణ్, నరేందర్, అలిశెట్టి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

జాగీర్యాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించడానికి హెడ్మాస్టర్ కళావతి, ఉపాధ్యాయులు వెంకయ్య, చంద్రమోహన్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా ముఖ్య అతిథిగా డాక్టర్ చింతకుంట ప్రవీణ్ కుమార్ సైంటిస్ట్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మోటివేషన్ స్పీచ్‌నిచ్చారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం



మాట్లాడుతున్న నాయకులు

నతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం హర్షనీయమని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్సీ, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఆకుల లలిత, మున్నూరు కాపు జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు బలరాం, కోశాధికారి ధర్మపురి సురేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నిజామాబాద్ నగరంలోని ప్రగతినగర్‌లో గల మున్నూరుకాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాంగ్రెస్ మున్నూరు కాపుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కార్పొరేషన్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. గతంలో మున్నూరు కాపులను ఏ ప్రభుత్వాలు పట్టిం చుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 3 నెలల్లోనే ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపు తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఆరు గ్యారెంటీ పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, రామూర్తి గంగాధర్, బాలవర్ధి, కోడెపు శరత్, దారం సాయిలు, శంకర్, ఆది శ్రీనివాస్, జిల్లా మున్నూరు కాపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాల సంస్థ కార్యదర్శి రమణ కుమార్



కార్యదర్శి రమణకుమార్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఈ నెల 18 నుంచి ఏప్రిల్ మూడో తారీకు వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బాలికలు కష్టపడి చదివి ఇష్టంతో పరీక్షలు రాసి 100 శాతం జీపీఏ మార్కులు సాధించాలని తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాల కార్యదర్శి రమణ కుమార్ ఆకాంక్షించారు. మండల పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలను ఆయన శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కిచెన్ షెడ్డును పరిశీలించారు. పాఠశాల కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం కార్యదర్శి రమణకుమార్‌ను ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, శంకర్‌గౌడ్, బాబుకిరణ్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

దూపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గ్రామంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను శనివారం వేశారు. అసిస్టెంట్ వెటర్నరీ శశిరేఖ ఆధ్వర్యంలో 150 పశువులకు గాలికుంటు టీకా లను వేశారు. వెటర్నరీ అసిస్టెంట్ భీమ్‌రావు, సిబ్బంది సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల పరిధిలోని పడకల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయకుమార్ ఆదేశాల మేరకు, జాతీయ ప్రధాన కార్యదర్శి మామిడాల మనోహర్, సౌత్ ఇండియా వర్కింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ గంప హనుమాగౌడ్, డాక్టర్ సంపత్‌గౌడ్, స్టేట్ చైర్మన్ సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు బట్టి దత్తాద్రిగౌడ్ 10వ తరగతి పరీక్ష రాయబోతున్న విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ధైర్యంగా ఉండాలని, మంచిగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఎడ్యుకేషనల్ చైర్మన్ కొప్పు రాజేందర్, సుర్బిర్యాల ప్రసాద్, మండల వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన ఆన్‌లైన్ నమోదు



నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారులకు గ్యాస్, విద్యుత్ బిల్లులో సబ్సిడీ వర్తించని లబ్దదారులు శనివారం కూడ ఆన్‌లైన్ నమోదు కొనసాగింది. ప్రతిరోజు 250 నుంచి 300 దరఖాస్తులు రావడంతో ఉదయం టోకెన్ ఇచ్చి లబ్దిదారుల నుంచి గ్యాస్, విద్యుత్ సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నట్లు ఎంపీడీవో సవితారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

ముఖ్యమంత్రి, మంత్రులకు ధన్యవాదాలు



ధన్యవాదాలు తెలుపుతున్న మేరు సంఘం

నవతెలంగాణ-గాంధారి

మండల మేరు సంఘం కార్యవర్గ సభ్యులు తెలంగాణ ప్రభుత్వం మేరు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా మేరు సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గాంధారి మండల మేరు సంఘం తరఫున ప్రత్యేక ధన్య వాదములు తెలిపారు. కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షులు దరబస్తు రవీందర్, ఉపాధ్యక్షులు రాజు, కోశాధికారి సాయిబాబా, గౌరవ అధ్యక్షులు తాళ్ల రాములు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లు ఇవ్వలే.. వసూళ్లు చేశారు

- షిండే మూడు పర్యాయాలు ఏమీ చేయలే
- ప్రజలకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుంది
- సుల్తాన్ పేట్ గ్రామంలో తాజా మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పలువురు గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరిక
- జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గానికి 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా పనిచేసిన హనుమంతు షిండే అభివృద్ధిని, ప్రజా సమస్యలని పట్టించుకోని దద్దమ్మ అని ఎమ్మెల్యే తోటా లక్ష్మికాంతారావు ధ్వజమెత్తారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై మద్నూర్ మండలంలోని సుల్తాన్ పేట్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ బాబు పటేల్, ఉపసర్పంచ్ షేక్ సలీం, గ్రామపంచాయతీ పలువురు వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయలేదు కానీ అక్రమ వసూళ్ల మాత్రం భారీగా చేశారని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో ఒక్కొక్కరి దగ్గర దాదాపు పదివేల రూపాయల వరకు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. అలాంటి అక్రమ వసూళ్లపై క్రిమి నల్ కేసులు పెట్టిస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన మాటకు ఒక్కొక్కటిగా మూ డు నెలల కాలంలో అమలు ప్రక్రియ ప్రారంభించడం జరిగిందన్నారు.

మండల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉండండి మీకు ఎలాంటి అభివృద్ధి పనులకైనా తాను అండగా నిలుస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మికాంతారావు ప్రజలకు హామీ ఇచ్చారు. అలాగే మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం చిన్న షక్కర్గా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ సభ, ఆ తర్వాత మండలంలోని చిన్న తడగూర్ ఖరగ్ గ్రామాల్లో సభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే వెంట స్థానిక మండల నాయకులు, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తహసీల్దార్ ఎండి ముజీబ్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, చెక్కులు పొందే లబ్ధిదారులు పాల్గొన్నారు.

బురుజు కూల్చి మట్టిని తీసుకెళ్లొచ్చు

- పంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ బండి వార్ విజయ్



కూలేందుకు సిద్ధంగా ఉన్న పూరాతన బురూజు

నవతెలంగాణ-మద్నూర్

బురుజులు కూల్చిన తరువాత మట్టిని ఎవరైన తీసుకెళ్లొచ్చని పంచాయతీ ప్రత్యేక అధికారి బండివార్ విజయ్ అన్నారు. మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పురాతనమైన మూడు పెద్ద బురుజులు ఉన్నాయి. ఆ బురుజులు కూల్చేందుకు ఇటీవల జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మికాంతారావు సందర్శించారు. పురాతనమైన బురుజులు వారే కూల్చాలి వారే మట్టిని తీసుకువెళ్లాలి అలాంటి వ్యక్తులు ఎవరైనా ఉంటే ముందుకు వస్తే వారికి అనుమతులు ఇస్తామని పంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ విజయ్ విలేకరులకు తెలియజేశారు. లక్షల రూపాయల విలువైన పురాతనమైన బురుజు మట్టి ఎంతో విలువైనదని అలాంటి మట్టి బురుజులు కూల్చిన వారికి తీసుకెళ్లేందుకు అనుమతులు ఇస్తామని తెలిపారు.

వైన్స్‌లో మద్యం తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నవతెలంగాణ బిచ్కుంద

మండల కేంద్రంలోని శివ మల్హర్ వైన్స్‌లో మద్యాన్ని ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి శనివారం తనిఖీ చేశారు. బిచ్కుంద గ్రామానికి చెందిన కొందరు వైన్స్‌లో నకిలీ మద్యం విక్రయిస్తున్నారని ఫిర్యాదు మేరకు మద్యం స్టాక్, పర్మిట్లు పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న మద్యం, మద్యాన్ని సీజ్ చేసి నిజామాబాద్‌లోని ఎక్సైజ్ ల్యాబ్‌కు తరలించారు. ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్ట్ ఆధారంగా వైన్స్‌పై చర్యలు తీసుకుంటామని సిఐ అన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్సై నగేష్, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య ఎస్ఎస్ సిబ్బంది ఉన్నారు.

అవిశ్వాస తీర్మానానికి స్టే ఎత్తివేసిన హైకోర్టు

- జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్

మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలుపై మెజార్టీ ఎంపిటిసిలు అవిశ్వాసం కోరగా అధ్యక్షురాలు అవిశ్వాసానికి అడ్డుకట్ట వేసేందుకు స్టే ఆర్డర్ తీసుకురావడం జరిగింది. అవిశ్వాసానికి అడ్డుగా ఉన్న స్టే ఆర్డర్‌ను హైకోర్టు ఎత్తివేస్తూ కొట్టి వేసిందని మద్నూర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవిపై త్వరలోనే అవిశ్వాసం జరుగుతుందని నూతన అధ్యక్షుల ఎన్నిక ఉంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మికాంతారావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వెల్లడించారు. అధ్యక్ష పదవిపై అవిశ్వాసం జరపడానికి ఎంపీ ఎన్నిక షెడ్యూల్ ఖరారు. అయితే ఆగిపోతుందని విలేకరులు ఎమ్మెల్యేకు అడుగగా అలాంటిదేం లేదని ఎన్నికల షెడ్యూలు అడ్డుపడని ఏప్రిల్ రెండో తేదీలోపు అవిశ్వాసం జరుపుకునే విధంగా హైకోర్టు ఆర్డర్ జారీ చేసిందని తెలిపారు. స్టే ఎత్తివేతతో మద్నూర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవిపై అవిశ్వాసం జరగనుంది.

గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని జలాల్పూర్ గ్రామపంచాయతీ రికార్డులను శనివారం ఎంపీవో శ్రీనివాస్ పరిశీలించారు. గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో 100 శాతం పన్నులు వసూలు చేయాలని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పెద్దగంగారాం



నవతెలంగాణ-పిట్లం

మండలంలోని మద్దెల చెరువు కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షులుగా రాజ బోయిన పెద్ద గంగారాంను ఏకగ్రీవంగా నియమించినట్లు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు జంబిగే హన్మాండ్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు గాను కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కమిటీలు దోహద పడతాయని అన్నారు. కమిటీలలో ఎన్నికైన వారు కాంగ్రెస్‌పార్టీ కుటుంబ సభ్యులను ఏకతాటిపై నడిపించి రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలలో విజయదుందుభి మ్రోగించి పార్టీకి పూర్వ వైభవం దిశగా కషిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్‌పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోర్ ఏర్పాటు

నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

మండలంలో శనివారం తాగునీటి కొరకు నూతనంగా బోర్ ఏర్పాటు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. గ్రామంలో గత కొంతకాలంగా తాగునీటి ఇబ్బంది ఏర్పడిందని ఈ విషయంపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి నూతనంగా బోర్ ఏర్పాటు చేసినట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు షాహిద్ పాషతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్, ఇమామ్, హనుమాన్లు, సాయగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటి, మల్లేశం, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థికి సన్మానం



బాజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను శనివారం జెడ్పిటిసిల ఫోరం ప్రధాన కార్యదర్శి ఉమన్న గారి మనోహర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరా బాద్‌లో ఎంపీ అభ్యర్థిని కలిసి సత్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పది పరీక్షలు పగడ్భందీగా నిర్వహించాలి

- ఎంఈవో వెంకటేశం



పిట్లంలో మాట్లాడుతున్న విద్యాధికారి దేవీసింగ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ వెంకటేశం అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్విజిలేటర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు.. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని ఇన్విజిలేటర్లకు ఆయన పలు సలహాలు సూచనలు చేశారు. అనంతరం పరీక్ష కేంద్రాల్లో వేస్తున్న హాల్ టికెట్ నెంబర్లను ఆయన పరిశీలించారు. తన వెంట సిఆర్పి రాజయ్య ఉన్నారు.

భిక్కనూర్ : పదవ తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని ఏబీవీపీ నాయకులు గంధం సంజయ్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాస్ కాపీయింగ్ పాల్పడకుండా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో శివ, సమీర్ ఖాన్, రాజేందర్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : యంఈవో దేవీసింగ్

పిట్లం : పదవ తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి దేవీసింగ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్విజిలెటర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్విజిలెటర్లకు ఆదేశించామన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసి రెండింటి పరీక్ష కేంద్రాలలో 539 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్‌లుగా వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా శ్రీరామ్, చంద్రకాంత్‌లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్విజి లెటర్లు పాల్గొన్నారు.

గ్రోమోర్‌పై విచారణ

- ఏడిఏ వీరాస్వామి



విచారణ చేపట్టిన అధికారులు

నవతెలంగాణ-కోటగిరి

గ్రోమోర్‌పై ఏడిఏ వీరాస్వామి విచారణ చేపట్టిన. గ్రోమోర్ రైతులకు కుచ్చుటోపి శీర్షికతో శనివారం ప్రస్తుతం అయిన వార్తకు స్పందనగా బాన్సువాడ ఏడిఏ వీరస్వామి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, మండల కేంద్రంలోని గ్రోమోర్ దుకాణాన్ని శనివారం పరిశీలించారు. ఆర్కే సోనా వరి రకపు విత్తనాలు ఎన్ని బస్తాలు రైతులకు అందించారని తెలుసుకున్నారు. 58 మంది రైతులకు 150 బస్తాలు ఇచ్చినట్లు గ్రోమోర్ దుకాణపు ఇంచార్జి కాశి విశ్వనాథ్ తెలిపారు. వారు ఇచ్చినటువంటి వరి వంగడం స్వల్ప, మధ్య, దీర్ఘకాలమా, ఎన్ని రోజులకు పంట చేతికి వస్తుందని ఏడిఏ అడిగిన ప్రశ్నకు గ్రోమోర్ ప్రతినిధులు నీళ్ల నమిలారు. వెంటనే వరి విత్తనాలపై ఆర్కే సోనా ప్రతినిధులు, అన్ని పత్రాలతో సోమవారం రావాలని లేనియెడల చట్టరీత్యా చలన తీసుకుంటామని చరవాణిలో వరి విత్తనాలు పంపిణీ చేసిన అధికారులకు ఆదేశించారు. కోటగిరీలో మిగిలిన 50 బస్తాలు ఎవరెవరికి ఇచ్చారని, వెంటనే ఆ రైతుల సమాచారం సేకరించమని మండల వ్యవసాయ ప్రతినిధులకు ఏడిఏ ఆదేశించారు. సీడ్ కంపెనీ వాళ్లకు పూర్తి సమాచారంతో సోమవారం రావాల్సిందిగా సీడ్ కంపెనీ వాళ్లను ఆదేశించారు. సీడ్ కంపెనీ వారు వచ్చిన వెంటనే నిజ నిర్ధారణ చేసి, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు తగు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సంబంధిత రైతుల పంట పొలాలను సందర్శించి, రైతులకు పంటకు తగు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా తెలియజేసి భరోసా కల్పించారు. ఏడిఏ వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు గౌస్, సందీప్, ఆస్మా భేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు పంపిణీ



పరీక్ష అట్టలతో విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని నల్లమడుగు ఉన్నత పాఠశాలలో శనివారం 10వ తరగతి చెందిన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. గాంధారి మండలం రామలక్ష్మిపల్లి గ్రామానికి చెందిన చిన్నోళ్ల నరేష్ నల్లమడుగు ఉన్నత పాఠశాలలో 2008-09 పదో తరగతి వరకు అదే పాఠశాలలో చదివారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తన వంతు 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, కిట్‌పాడ్స్, పెన్స్‌స్కేల్, కంపాక్స్ విద్యార్థులకు అందజేశారు. సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకొని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. అదే విదంగా పదవ తరగతి పరీక్షలలో 9.5, 10.0 జిపిఏ సాధించిన విద్యార్థులకు తన వంతుగా నగదును అందిస్తానన్నారు. మొదటగా ప్రథమ స్థానం వచ్చిన వారికి రూ.1000, ద్వితీయ రూ.500 అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతినెల సేవ్ ది చిల్డ్రన్స్, హైదరాబాద్‌లో అనాథ వద్ద ఆశ్రమంలో తనవంతు సహాయం చేస్తుమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు కష్ణ మోహన్, రామారావు, 2008-09 పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ డిపోలో మెగా హెల్త్ క్యాంప్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి బస్ డిపోలో శనివారం వన్ కార్డ్ బిజినెస్ సొల్యూషన్ ఆధ్వర్యంలో అఖిల హాస్పిటల్, నిమ్మస్ డెంటల్ హాస్పిటల్ వారి సహకారంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు డిపో మేనేజర్ ఇందిరా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుమారు 200 మంది సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మెడిసిన్ అందజేశారని తెలిపారు. ఉచితంగా డిస్కౌంట్ కార్డు ఆర్టీసీ సిబ్బందికి అందజేయడం పట్ల డిపో మేనేజర్ వన్ కార్డ్ సిబ్బందిని అభినందించారు. అనంతరం వన్ కార్డ్ సిబ్బంది మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 20వేల కార్డులు ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్డు వల్ల పలు హాస్పిటల్‌లో మూడు నెలల వరకు ఉచిత ఓపి కన్సల్టేషన్‌తో పాటు మెడికల్ ల్యాబ్‌లో 30 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తాయని ఇతర వ్యాపార సముదాయాలు ప్రత్యేక డిస్కౌంట్లు లభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు పుట్ట మల్లికార్జున్, పుట్ట భవాని, అభిషేక్‌రెడ్డి, బస్‌డిపో అసిస్టెంట్ మెకానికల్ వసుంధర, లింగమూర్తి, హెల్త్ వాలంటర్స్ కల్పన, ఎల్పిరావు, వన్ కార్డ్ ప్రతినిధులు రవి, రమ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణా టీకాలు



టీకాలు అందజేస్తున్న పశు వైద్యాధికారిణి రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గ్రామంలో శనివారం మండల పశు వైద్యాధికారిణి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారిణి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. మూడు నెలలు పై బడిన పశువులన్నింటికి ప్రభుత్వం అందిస్తున్న టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. ఇందులో భాగంగా పశువైద్య సిబ్బంది గంగాధర్, మధుకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందించాలి



సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-దోమకొండ

మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన పథకం ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా గృహజ్యోతి దరఖాస్తుల కేంద్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంతరెడ్డి, జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్ శనివారం పరిశీలించరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారంటీల పథకాలు సకాలంలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. మండలంలో గహజ్యోతి పథకంలో జీరో బిల్లు రాకపోవడంతో కొంతమందికి రాకపోవడం వల్ల లబ్ధిదారులు అయోమయం స్థితిలో ఉన్నందున విద్యుత్ శాఖ ఏడి కిరణ్ చైతన్యతో ఫోన్లో మాట్లాడి తగు సూచనలు చేశారు. గృహజ్యోతి పథకంలో లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా గ్యాస్ ఏజెన్సీలు సహకరించాలని సూచనలు చేశారు. త్వరలో ఎంపీ ఎలక్షన్ జరగనున్నందున అధికారులు స్పందించి 6 గ్యారంటీల పథకానికి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు రాములు, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రెండో రోజు మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ బిల్లులు చెల్లించాలని శుక్రవారం ఏజెన్సీ కార్మికులు ప్రారంభించిన సమ్మె శనివారం కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేంతవరకు సమ్మె కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | మార్చి 17, 2024 | www.navatelangana.com

అంగన్వాడి చిన్నారులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా అంగన్వాడీ కేంద్రంలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. వారికి వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు వివరించారు. మరో ఐదుగురిని నిజామాబాద్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. చిన్నారులకు రక్తహీనత తదితర పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఎం పూర్ణ, అంగన్వాడీ టీచర్ రాజశ్రీ, ఏఎన్ఎం శోభ, ఆశావర్కర్స్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జైలు నుంచి నామినేషన్ వేస్తారా..?

- ఎంపీ ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జైలు నుంచి నామినేషన్ వేస్తారా? అని జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను ఎక్కడి నుంచి పోటీ చేసినా ఓడిస్తానని కవిత శపథం చేసిందని, ఇప్పుడు జైలు నుంచి నామినేషన్ వేస్తారా అని వ్యాఖ్యానించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, దినేష్ కులచారి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన మధ్యాహ్న భోజన కార్మికులు


ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న భోజన కార్మికులు

నవతెలంగాణ-బోధన్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు రోజులుగా మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం ఆర్డిఓ అంబదాస్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బోధన్ మండల అధ్యక్షురాలు రూప మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు రావలసిన బకాయి వేతనాలు, బిల్లులను ప్రభుత్వం తక్షణమే మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు. అలాగే వంట కోసం గ్యాస్ సిలిండర్లను, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల ఐదవ తేదీన వేతనాలు, బిల్లులు విడుదల చేయాలని కోరారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో కార్మికులు పోషవ్వ, ఉమా, నాగరాజు, విఠల్, ఈశ్వరి, పుష్ప, ఉమా, సుభద్ర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ముత్యంపల్లి, ఒడ్యాట్‌పల్లి గ్రామల్లో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారులు కిరణ్ దేశ్‌పాండే, ఉమాను సహేర్ పాడిరైతుల వద్దకు వెళ్లి.. మూడు నెలలు పైబడిన పశువులన్నింటికీ టీకాలు వేయించాలని సూచించారు. గాలికుంటు వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వీఎల్‌ఓటి వినీత, ఎండీ. అహ్మద్ పాషా, గోపాలమిత్ర సబీర్, ఆఫీస్ సబార్డినెట్‌లు మహేశ్వరి, శ్రీనివాస్, గంగాధర్, లక్ష్మీ పుష్ప పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



తహసీల్దార్ వనజను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకోని శనివారం ఉదయం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ముప్కాల్ తహసీల్దార్ వనజ రాణిని ఉత్తమ మహిళగా ఎంపిక చేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ముప్కాల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్ మాట్లాడుతూ.. మహిళలు ఉన్నత విద్యను అభ్యసిస్తూ పలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని సూచించారు. దేశంలోని మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీకాంత్, ముప్కాల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, సెక్రటరీ కట్ట మహేష్, ట్రెజరర్ జక్కుల రాము, సిద్ధ రమేష్, సీనియర్ అసిస్టెంట్ జె.దశరథం, ఆర్.ఐ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ ఫౌండేషన్ శిక్షకులు మహేంధర్, నవనీత, వినోద్ ఆరు నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రేరణ కలిగించే ఉపన్యాసాలు (మోటివేష్నల్ స్పీచ్)ను అందించారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులు, సమాజం పట్ల ఎలా మెలగాలో తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షల గురించి పలు సలహాలు, సూచనలను అందించారు. అనంతరం ఇంపాక్ట్ ఫౌండేషన్ శిక్షకులకు పాఠశాల తరపున సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, కస్తూర్బా పాఠశాల ఎస్.ఓ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.


కంఠేశ్వర్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


వర్నిలో...


డిచ్‌పల్లిలో...


నవీపేటలో...

ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమం

- పలుచోట్ల బీఆర్ఎస్ నాయకుల నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాసంలో ఈడి అధికారులు తనిఖీలు చేసి ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు శనివారం పలుచోట్ల నిరసనలు చేపట్టారు.

కంఠేశ్వర్ : ఉమ్మడి నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కార్ ఈడి అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ శనివారం ధర్నా చౌక్‌లో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ ఆదేశానుసారం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఈడికి విడదీయలేని బంధం ఉందని తెలిపారు. జాతీయ సంస్థ అయిన ఐటి, ఈడి, సిబిఐ లాంటి జాతీయ దర్యాప్తు సంస్థలను జేబులో పెట్టుకున్నారని తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగా అరెస్టు ఎలా చేస్తారని, ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయాలి, లేనిపక్షంలో బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సిర్ప రాజు, ఉద్యమకారులు సుజాత్ సింగ్ ఠాగూర్, రవి చందర్, సత్య ప్రకాష్, నవీద్ ఇక్బాల్, విక్రమ్‌గౌడ్, సాయివర్ధన్, ప్యాట సంతోష్, విజయలక్ష్మి, ఆకాష్, శ్రీనివాస్‌గౌడ్, మధు, అపర్ణ, శోభావతి, సాయి వర్ధన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : పట్టణంలోని రైల్వే గేట్ వద్ద బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రవీంద్ర యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అక్రమమని అన్నారు. ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం దాడులు చేయించి బెదిరించాలని పన్నాగం పన్నిందని అయినా వారి బెదిరింపులకు ఎవరు భయపడరని అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్దోషిగా తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిరసనలో నాయకులు రజాక్, నాగనపల్లి మధు, భవానిపేట శ్రీనివాస్, మేడి రవి, అడ్లూరి నరేష్, రవిశంకర్‌గౌడ్, సిర్ప సుదర్శన్, బెంజర్ గంగారం తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు చేయించిన ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు శేషుగారి భూమారెడ్డి మాట్లాడుతూ.. సుప్రీం కోర్టులో కేసు నడుస్తూ ఉండగా కవితను అక్రమంగా అరెస్టు చేయడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ పనితీరుపై ఆయన మండిపడ్డారు. మోడీ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ధర్నా చేసుకోవాలి కానీ దిష్టిబొమ్మను దహనం చేయవద్దని వారు స్పష్టం చేయడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సీఐ ఆదేశాల మేరకు రోడ్డుపై కాకుండా రోడ్డు కింద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాఘవేందర్, కాశం సాయిలు, గోపాల్‌రెడ్డి, అనిల్, తిరుపతి రాము, ఆశాడి భూమయ్య, పేరోజ్ బేగ్, తగిలేపల్లి అంజయ్య, గంగారెడ్డి, బోర్గం లక్ష్మణ్, రవి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మోడీ దిష్టి బొమ్మ దహనం..

మాక్లూర్ : మండలంలోని మానిక్‌బండారు సమీపంలో గల 63వ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అక్రమంగా అరెస్ట్ చేశారని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని కేంద్రాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుగు గంగాధర్, మండల నాయకులు అబిబ్, మహేష్, గంగాధర్, వేణు, కృష్ణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

వర్ని : ఉమ్మడి మండలంలోని పలు మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ కవితను ఏసీబీ అధికారుల అరెస్టుకు నిరసనగా వర్నిలో గంటపాటు రాస్తారోకో చేపట్టారు. చందూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఏసీబీ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు గిరి, గోపాల్, రాజు, గంగాధర్, నామాల సాయిబాబా, చందూర్‌లో సాయరెడ్డి, ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, ప్యారం అశోక్ యాదవ్, సత్యనారాయణ, దేవిసింగ్, అంబర్ సింగ్, పలు గ్రామాల బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలూర్ మండలాధ్యక్షులు పూజ నరేందర్, ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ కక్షసాధింపే..

డిచ్‌పల్లి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు ముమ్మాటికీ కక్షసాధింపు చర్యేనని, త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో లబ్దిపొందాలనే ఉద్దేశంతో అక్రమంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్ యువ నాయకులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బిజెపి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యనిర్వహక రాష్ట్ర అధ్యక్షులు కేటీఆర్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ ధర్నా నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, చిలువేరి గంగదాస్, సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ, పద్మారావు, పాశం కుమార్, రఘునాథన్ రాము, కచ్చుకాయల శ్రీనివాస్, అరటి రఘు, చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, మోహమ్మద్ యూసఫ్, నయీమ్, బుల్లెట్ అక్బర్‌ఖాన్, ఎంపిటిసి సాయిలు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నవీపేట్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపిలు ఒక్కటై బిఆర్ఎస్ పార్టీపై కుట్రలు పన్నుతున్నాయని మండల కన్వీనర్ నర్సింగ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్రధాని మోడీ, ఈడీల దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి అన్నదమ్ముల పాత్రను పోషిస్తున్నారని రెండు పార్టీలు ఏకమై తెలంగాణ గొంతుక బిఆర్ఎస్ పార్టీని నాశనం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే ఎమ్మెల్సీ కవితను మహిళా అని చూడకుండా చట్ట వ్యతిరేకంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే విడుదల చేయాలని, లేకుంటే బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా పోరాడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తెడ్డు పోశెట్టి, అబ్బన్న, తాహెర్, సాయి కుమార్‌గౌడ్, అప్సర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాగును పరిశీలించిన ఆర్మూర్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాలేశ్వర్ వాగును ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శనివారం పరిశీలించారు. గ్రామంలో వివాహానికి హాజరైన సందర్భంగా గ్రామ సర్పంచ్ సరీన్, గ్రామస్తులు బోధన్, ఆర్మూర్ నియోజకవర్గాల సరిహద్దు వాగు బ్రిడ్జి గతంలో పడ్డ భారీ వర్షాలకు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలుపగా సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే నాలేశ్వర్ నుంచి డొంకేశ్వర్ వరకు మంజూరైన రోడ్డును త్వరలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్ల గంగాధర్, కోనేరు చిన్న భీమారెడ్డి, గణేష్, దేవిదాస్, తోట సుధాకర్, భూషణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మిట్టపల్లి క్రీడాకారిణికి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారం పతకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 14 నుంచి 16 వరకు ఆది లాబాద్ జిల్లా నేరేడిగొండలో నిర్వహించిన 8వ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి పాఠశాల 7వ తరగతి విద్యార్థిని చేల్మిటి అమూల్య పాల్గొని జట్టు ప్రథమస్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించి బంగారు పతకం అందుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.శోభన్‌బాబు అభినందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలలో బంగారు పతకం సాధించిన అమూల్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగామోహన్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.



బంగారు పతకం అందుకుంటున్న అమూల్య

కులమతాలకతీతంగా కలిసే ఉండాలి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మాక్లూర్

ప్రతి ఒక్కరూ రజాకార్ సినిమాను చూడాలని, గతంలో మన బతుకులు ఎలా ఉండేవనేది తెలుస్తుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాక్లూర్ మండలంలో 102, ఆలూర్ మండలంలో 22, మొత్తం 124 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా ఉండాలని, అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. రాజకీయ నాయకులందరం కలిసే ఉంటామని, మీరు కూడా కలిసి ఉండాలని, వచ్చే ఎన్నికల్లో ఎవ్వరికీ నచ్చిన పార్టీకి వాళ్ల ఓట్లు వేసుకోవాలని సూచించారు. ఎన్నికలప్పుడు రాజకీయమని, ఎన్నికల తరువాత అందరూ కలిసి అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ డి.విఠల్‌రావు, ఎంపిపి ప్రభాకర్, స్థానిక ఎంపిటిసి వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ షబ్బీర్, ఎంపీడీఓ క్రాంతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇండ్లల్లో చోరీ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 21, 22 వార్డులలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు మూడు ఇండ్లలో చోరీ చేశారు. క్లాసిక్ ఫంక్షన్ హాలుకు చెందిన నయీముద్దీన్ ఇంటి గోడను దూకి ఇంట్లో చొరబడి సుమారుగా రెండు లక్షల రూపాయల నగదును, 10 తులాల బంగారంతో పాటు విలువైన బట్టలు ఎత్తుకెళ్లినట్టు బాధితుడు తెలిపాడు. 22వ వార్డుకు చెందిన శబానా బేగం ఇంట్లో రూ.80వేల నగదు, తులం బంగారాన్ని ఎత్తుకెళ్లారు. దొంగలు ఇదే వార్డుకు చెందిన గంగుబాయి ఇంటి తాళం పగులగొట్టి చోరీకి ప్రయత్నం చేయగా ఆ శబ్దానికి పక్కింటి వారు అరవడంతో కొన్ని వస్తువులు దొంగిలించి పరారయ్యారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరికలు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని ఎంజి తాండ తాజా మాజీ సర్పంచ్ రమేష్, పల్లికొండ గ్రామానికి చెందిన 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి సునీల్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రజాపాలన సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల ఆశయాలకనుగుణంగా అందుతుందని, దీంట్లో భాగంగానే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి ముత్యాల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో పనిచేయుటకు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. చేరిన వారిలో పల్లికొండ గ్రామానికి చెందిన అశోక్, చందు, రాజేశ్వర్, బద్రి, నవీన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొదిరే స్వామి, జేజే నరసయ్య, కుంట రమేష్, అనంతరావు, కిరణ్, రాజేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలున్నారు.


కాంగ్రెస్‌లో పలువురు చేరిక

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పశువులకు ఆరోగ్యం


పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయని మండల పశువైద్యాధికారి శిరీష అన్నారు. శనివారం మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఉన్న పశువులన్నింటికీ గాలికుంటు నివారణ టీకాలు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అశోక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర కార్పొరేషన్‌పై హర్షం

- జిల్లా నాయకులు సోన్‌పేట్ నారాయణ

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల గంగపుత్ర సంఘం జిల్లా నాయకులు, సోన్‌పేట్ మత్స్య సహకార సంఘం అధ్యక్షులు సోన్‌పేట్ నారాయణ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాపాలనలో గంగపుత్రులు ఒకవైపు రాజకీయంగా మరోవైపు పారిశ్రామికంగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

ఇంటి పన్ను వసూళు

నవతెలంగాణ-ఏర్గట్ల.

మండల కేంద్రంలో ఎంపీఓ శివ చరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఇంటి పన్నుల వసూళ్లను నిర్వహించారు. శనివారం ఒకే రోజు రూ.1లక్ష 60వేలు వసూలైనట్లు ఆయన తెలిపారు. పన్నుల ద్వారా వచ్చిన నిధులతో గ్రామంలో రోడ్లు, మురికి కాలువల నిర్వహణ, తాగునీటి, ఇతర అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. పన్నులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎడపల్లి ఎస్ఐ విక్రమ్ బదిలీ

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి ఎస్ఐ విక్రమ్ ధర్పల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సిపి కల్మేశ్వర్ బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. ఎడపల్లి పోలీస్ స్టేషన్లో ఇదివరకు పనిచేసిన ఆయన అంకిత భావంతో విధులు నిర్వహించారు. అనతికాలంలోనే ఎడపల్లి మండల ప్రజల మన్ననలను పొందారు.

బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్, బిజెపి నాయకులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నివాసంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అంజాగౌడ్, వడ్ల పోశెట్టి, పంతులు సాయిలు, మచ్చర్ల నాగన్న, పోతన్న, తెలుగు నర్సయ్య, గిరిజపతి, ఒడ్డెన్న తదితరులు పార్టీలో చేరారు.



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

లోక్ అదాలత్‌లో 819 కేసుల పరిష్కారం

నవతెలంగాణ-బోధన్

బోధన్ న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 819 కేసులు పరిష్కరించా రు. న్యాయస్థానంలో నాలుగు బెంచీలను ఏర్పాటు చేసి 819 కేసులు పరిష్కరించారు. ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్, సభ్యులు డాక్టర్ మధుసింగ్ 08 సివిల్ కేసులు, 41 బ్యాంక్ కేసులు పరిష్కరించారు. సివిల్ జడ్జ్ అజయ్ కుమార్, సభ్యులు మారుతిరావు కన్నా 2 సివిల్ కేసులు పరిష్కరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, సభ్యులు సిహెచ్‌వి హనుమంతరావు 13 సివిల్ కేసులు, 652 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సాయిశివ, సభ్యులు కళ్యాణి 103 క్రిమినల్ కేసులు పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో బోధన్ న్యాయసేవా సంస్థ సిబ్బంది గణేష్, తులసి పాల్గొన్నారు.



రేపటి నుంచి పది పరీక్షలు

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

పదవ తరగతి పరీక్షల కోసం అన్నీ ఏర్పాట్లు పూర్తిచేసి నట్టు ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కావడంతో విద్యార్థుల కోసం అన్నీ మౌళిక వసతులు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.



పరీక్ష కేంద్రంలో నెంబర్లు వేస్తున్న ఉపాధ్యాయుడు

బోధన్ : సోమవారం నుంచి జరగనున్న ఎస్.ఎస్.సీ పరీక్షలకు కావలసిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు బోధన్ మండల విద్యాధికారి నాగనాథ్ తెలిపారు. బోధన్ ఉమ్మడి మండలంలో 13 పరీక్ష కేంద్రాలలో మొత్తం 2962 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. 13 మంది చీఫ్ సూపరింటెండ్లు, అవసరమైన ఇన్విజిలేటర్లను, రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయం కోసం వైద్య సిబ్బంది, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం జరిగిందని, కావున ఎలాంటి కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. శనివారం ఆయన బోధన్ పట్టణంలోని విజయమేరీ హైస్కూల్, ఉషోదయ కళాశాలలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు.

పరీక్ష హాల్లో చెడిపోయిన ఫ్యాన్లు..

ఎస్ఎస్సి పరీక్షల కోసం అధికారులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ప్రకటించినా.. బోధన్ పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రంలో మాత్రం పరీక్ష హాల్లో కరెంట్ కనెక్షన్ లేదు. ఫ్యాన్ చెడిపోయి ఉంది. దాంతో విద్యార్థులకు అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. అయినా ఆ సమస్యలు అధికారులు గుర్తించలేకపోతున్నారు. అలాగే పలుచోట్ల కిటికీ తలుపులు విరిగి ఉండడం, వెలుతురు సరిగా లేని కేంద్రాలు ఉన్నట్లు సమాచారం. అధికారులు వేసవికాలం దృష్ట్యా విద్యార్థులకు అందుబాటులో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం, వైద్య సౌకర్యం ఏర్పాటు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెంజల్ : ఈనెల 18 నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు తెలిపారు. రెంజల్ మండలంలో 384 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 43 మంది మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు నవీపేట్ మండలంలో పరీక్షలు రాయనున్నారని, మిగతా 341 మంది మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావివ్వకుండా ఇన్విజిలెటర్లు విద్యార్థులచే పరీక్షలు రాయించాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు.

ఆర్మూర్ : ఈ నెల 18 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని మండల విద్యాధికారి రాజా గంగారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 14 పరీక్ష కేంద్రాలు, 14 మంది సిఎస్‌లు, 14 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లు, 125 మంది ఇన్విజిలెటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పదవ తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కమ్మర్‌పల్లి : ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి ఆంధ్రయ్య శనివారం తెలిపారు. కమ్మర్‌పల్లి మండలంలో 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తంగా 432 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కలిపి మొత్తం 182 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చౌట్‌పల్లి పరీక్ష కేంద్రంలో 120 మంది, హాసకొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 50 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోనసముందర్ పరీక్షా కేంద్రంలో 115 మంది విద్యార్థులు పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరీక్షలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేలా ఆదేశించినట్లు వివరించారు.



పరీక్ష కేంద్రంలో చెడిపోయిన ఫ్యాన్

పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాటు..

ఏర్గట్ల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగబోయే పదో తరగతి పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, విద్యార్థుల కోసం అన్నీ వసతులు కల్పించామని ఎంఈఓ ఆంధ్రయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఒకే ఒక ప్రధాన పరీక్ష కేంద్రంలో మండల వ్యాప్తంగా ఉన్న నాలుగు ఉన్నత, ఒక కేజీబీవీ పాఠశాల కలిపి మొత్తం 146 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ నెల 18 నుంచి 30 వరకు పరీక్షల నిర్వహణ ఉంటుందని తెలిపారు.

'టిఫిన్ బైటాక్' కార్యక్రమంలో ఎంపీ అర్వింద్

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో శనివారం 'టిఫిన్ బైటాక్' కార్యక్రమం నిర్వహించినట్టు బీజేపీ మండల అధ్యక్షులు గడ్డం సంతోష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ హాజరై ప్రసంగించారు. రానున్న లోకసభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. పలువురు మహిళలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు ఏలేటి మల్లికార్జునరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షులు గడ్డం సంతోష్‌రెడ్డి, మెడికల్ విక్రమ్, ముస్కు నర్సయ్య ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ, చిల్క దినేష్, మ్యాక నర్సయ్య, కిషన్, కొంద్ర దిలీప్, ముత్యంరెడ్డి, అంబటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార ఉత్సవాలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాలు పట్టే విధానం గురించి వివరించారు. మన జీవితంలో చిరుధాన్యాలు బాగా తీసుకోవాలని, పోషకాలతో కూడిన వైవిధ్య భరితమైన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి వివిధ రకాల వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలియజేశారు. అనంతరం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు పోషకాలు పోకుండా వంటలు ఎలా చేసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు సుజాత, రాజమణి, లక్ష్మి, విజయ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చందూర్ తైబజార్ సంత వేలం పాట

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండల కేంద్రంలో వార సంత, రోజువారి సంత కోసం శనివారం వేలం పాటను నిర్వహించినట్టు పంచాయతీ సెక్రెటరీ సాయిలు తెలిపారు. వార సంత రూ.లక్ష 93 వేల రూపాయలకు రుద్రూర్ గ్రామస్తులు సాయిలు దక్కించుకోగా, రోజువారి సంతను రూ.53,100 ఎండీ అమీర్‌ఖాన్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తారాచందు, వైస్ ఎంపీపీ దశగౌడ్, మాజీ ఉప సర్పంచ్ చంద్రశేఖర్, సెక్రటరీ సాయిలు, రాంరెడ్డి, ఖలీమ్, వేలం పాట దారులు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ క్షత్రియ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్షత్రియ విద్యాసంస్థల కోశాధికారి శ్రీ అల్జాపూర్ గంగాధర్ జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్షత్రియ విద్యాసంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ తన సందేశాన్ని పంపిస్తు ప్రస్తుత పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ భావి జీవితంలో ప్రయోజకులై, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే విద్యాసంవత్సరపు పదో తరగతి విద్యార్థులకు హృదయపూర్వక స్వాగతం పలికారు. కోశాధికారి అల్జాపూర్ గంగాధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తదుపరి విద్యను చక్కని సంస్కారంతో అలవరచుకొని జీవితంలో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. క్షత్రియ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ ఆర్కె పాండే మాట్లాడుతూ.. విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి చదువు నాంది పలుకుతుందని అన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారాన్ని పొందుటకు పాఠశాల జీవితం ఎంతోగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి నరసింహస్వామి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత విద్య పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలనే లక్ష్యంతో తమ పాఠశాల పనిచేస్తుందని అన్నారు. ఈనాటి ప్రపంచంలో ఆధునికతను ఆస్వాదిస్తూ మన సంస్కృతి సంప్రదాయాలను ఏ మాత్రం మరిచిపోకుండా ఉండాలని తెలిపారు. తదనంతరం విద్యార్థిని విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఎంతోగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో డైరెక్టర్స్ అల్జాపూర్ వీరేంద్ర, జయంత్, అక్షయ్ పరీక్షిత్, టీచర్స్ కాలనీ పాఠశాల అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

బాధిత కుటుంబాన్ని పరామర్శ

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన ధనుష్ వాళ్ళ సోదరుడు రాజేశ్వర్ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మగ్గిడి ముత్యంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎట్టెం మహేష్ యాదవ్, ఎస్.రాజ్‌కుమార్ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ మందకృష్ణ మాదిగతోనే సాధ్యం

- ఎంఆర్‌పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు మైలారం బాలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఎస్సీ వర్గీకరణ మందకృష్ణ మాదిగతోనే సాధ్యమని ఎంఆర్‌పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు మైలారం బాలు అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ మందకృష్ణ మాదిగతోనే సాధ్యమని మాదిగలంతా వర్గీకరణ కొరకు పోరాటం చేద్దామని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లేకపోవడం వల్ల మాదిగలు గత ముప్పై ఏళ్లుగా విద్య, ఉద్యోగ, సాంఘిక, సంక్షేమ రంగాలలో తీవ్రంగా నష్టం జరిగిందని ఆయన అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అనేక మార్లు హామీలు ఇచ్చి సమస్యను పరిష్కరించడంలో మాదిగలను మోసం చేశాయని మండిపడ్డారు. నవంబర్ 11వ తేదీన స్వయానా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాదిగల విశ్వరూప మహాసభకు హాజరై మాదిగలకు అండగా ఉండి సమస్య పరిష్కరిస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. తమ సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేస్తారనే పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపూరి శ్యామ్, మండలాధ్యక్షులు నాగం శ్రీనివాస్, మాదిగ మహిళ సమాఖ్య నాయకురాలు గుముటు పద్మ, కొత్తూరు సందీప్, బాబురావు, అభినవ్, తరుణ్, బన్నీ, మనోహర్, సూర్య, గణేష్, రమణ, నితీష్, మున్నా, నితీష్ తదితరులు పాల్గొన్నారు.


వీర నారీమణుల బలిదానమే.. సాధికారతకు స్ఫూర్తి

నవతెలంగాణ-బోధన్

నాటి వీర నారీమణుల బలిదానమే ఆధునిక మహిళల అభ్యున్నతికి సాధికారతకు స్ఫూర్తి అని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోదావరి అన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 167 సంవత్సరాల క్రితం 1857లో అమెరికాలోని న్యూయార్క్‌లో 8 గంటల పని దినానికై, పని ప్రదేశాల్లో సౌకర్యాల కోసం, సమానపనికి సమాన వేతనాలకై మహిళలు పెద్దఎత్తున ఉద్యమించారని అన్నారు. దానిలో 146 మంది కాల్చివేతకు గురయ్యారని, నాటి వీర నారీమణుల బలిదానమే ఆధునిక మహిళల అభ్యున్నతికి, తదుపరి సాధించిన సాధికారతకు, విజయాలకు, విశ్వాసాలకు స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. సమాజంలో సగభాగమైన మహిళల హక్కుల కోసం, సమానత్వ సాధన కోసం, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడాల్సిన కర్తవ్యాన్ని కొనసాగించాలని గుర్తుచేశారు. నేడు బిజెపి ప్రభుత్వం రాముడి పేరుతో రాజకీయ కుయుక్తులతో లబ్ది పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. మతోన్మాదంతో ప్రజలను విభజించి పాలించే దుర్మార్గపు నీతిని ఎండగట్టాలని, మోడీ ప్రభుత్వం అనుసరించే మతోన్మాద ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మన హక్కులను, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి బీ పాషాబేగం అధ్యక్షత వహించగా పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, జిల్లా నాయకురాలు నర్సక్క, అనీస్, ఫాతిమా బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్యాక్స్ మాజీ చైర్మన్ ఎ.సాయరెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా

నవతెలంగాణ-వర్ని



బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుడు, చందూర్ మండల మాజీ ప్యాక్స్ చైర్మన్ అరికెలా సాయరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బీఆర్ఎస్‌లో పదేళ్ల పని చేసినా గుర్తింపు లేదని, అవమానాలు ఎదుర్కొన్న ఘటనలున్నాయని పేర్కొన్నారు. బీబీపాటిల్ బిజెపిలోకి పోవటంలో నియోజకవర్గంలో తన అభిమానిగా ఆయన ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ రాజీనామా చేసి బిజెపిలో తనతో పాటు సుమరు 150 మంది త్వరలో బిబి పాటిల్ సమక్షంలో బిజెపిలో చేరబోతున్నామని పేర్కొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యం

- జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమని జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ అన్నారు. శనివారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యువతీ యువకులకు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించడం కోసం తీసుకోవాల్సిన చర్యలు, వ్యాధికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, వ్యాధి నిర్మూలనకు దోహదపడాల్సినటువంటి అంశాల గురించి వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శైలి బెల్లాల్ మాట్లాడుతూ.. ఎయిడ్స్ నిర్మూలన అసాధ్యమైన విషయమేమీ కాదని అందరికీ అవగాహన కల్పించినప్పుడు ఈ వ్యాధిని సమూలంగా ప్రబలకుండా చేయవచ్చని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం ఎన్నో అవగాహన కార్యక్రమాలు నివారణ చర్యల ద్వారా వేగంగా ఎయిడ్స్‌ను అరికట్టగలిగిందని, ప్రజల సహకారం ముఖ్యంగా యువతీ యువకుల అవగాహన ద్వారా పూర్తిగా నిర్మూలన సాధ్యమేనని ఆమె తెలిపారు. ఎయిడ్స్ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ డైరెక్టర్ సేతు మాధవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసే ప్రయత్నాలను మించి ప్రజలు విస్తృతంగా ఎయిడ్స్ గురించి తెలియని వాళ్ళకి తెలిసేలా చెప్పడం అరక్షిత లైంగిక సంబంధాలు వాటి వల్ల వచ్చే ఇబ్బందులను తెలియజేయడం ద్వారా ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. అందుకోసం ప్రతి గ్రామంలో ఉండే యువతీ యువకులు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ సుధాకర్ మాట్లాడుతూ.. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం ద్వారా అన్ని వ్యాధుల నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చని దానికోసం ముఖ్యంగా అవగాహన అవసరమని, అలాంటి అవగాహనను కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నెహ్రూ యువ కేంద్రాన్ని అభినందించారు. పోటీలలో పాల్గొన్న యువతీ యువకులందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు. పోటీల విజేతలకు నగదు బహుమతిని, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ సుధాకర్, స్రవంతి, పవన్, హరీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందజేత

బొంబాయి నర్సింగ్ హెూమ్ సూపర్ స్పెషాలిటీ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

30 ఏండ్లుగా నిరంతరాయంగా వైద్య సేవలు అందిస్తూ, నిజామాబాద్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు ఉచితంగా సేవలు అందిస్తున్నామని బొంబాయి నర్సింగ్ హెూమ్ యాజమాన్యం డాక్టర్ నరేంద్ర అన్నారు. నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల బొంబాయి నర్సింగ్‌ను అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ దండు నీతూ కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యాధునిక పరికరాలు ఏర్పాటుచేసి ఆధునీకరించడంతో మరెన్నో సేవలు ఇకనుంచి అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ఇప్పటినుంచి ఆసుపత్రిలో డెంటల్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ టి.నరేంద్ర, డాక్టర్ శాంతన్ రావు మాట్లాడుతూ నగర ప్రజలకు డెంటల్ సౌకర్యం, రుట్ కెనాల్ ట్రీట్మెంట్ అందుబాటులో ఉందని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కామిని, డాక్టర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్ర సభ విజయవంతం చేయండి..

విజయ సంకల్ప యాత్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. భారతీయ జనతా పార్టీ (బిజెపి) జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై ఆయన మాట్లాడుతూ.. ఇందూర్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్స్ కలిపి 18న ఉదయం 10 గంటలకు భారీ బహిరంగ సభ జగిత్యాలలో నిర్వహిస్తారని అన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రానున్నారని, ప్రపంచ ప్రఖ్యాత నాయకునిగా పేరుపొందిన నరేంద్రమోడీ మొదటిసారిగా జగిత్యాల పట్టణానికి రావడం అక్కడ ప్రజలందరూ ఆ మహనీయుని రాక కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, కార్పొరేటర్స్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రావంతి రెడ్డి, సుక్క మధు, ఎర్రం సుదీర్, ఇల్లేందుల మమతా ప్రభాకర్, బీజేపీ నాయకులు, భాస్కర్, మఠం పవన్, హరీష్ రెడ్డి, నరేష్, హరీష్, పవన్ ముందడ, తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌స్పెషాలిటీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రైతులు సాగునీటిని పొదుపుగా వాడాలి

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకొని పంటలు పండించుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జన్నెపల్లి మాటు కాలువ మరమ్మతు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాటు కాలువను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జన్నెపల్లి శివారు నిజాంసాగర్ నీటి పరివాహక ప్రాంతం కావడంతో గతంలో నిర్మించిన కాలువలు కొన్నిచోట్ల మరమ్మతులు అవసరం ఉందని, రూ. 8.2 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందని జూన్ వరకు పనులను పూర్తి చేయాలని సూచించారు. దీని ద్వారా సుమారు 1800 నుంచి 2000 ఎకరాలకు సాగునీరు లభిస్తుందని అన్నారు. అటువంటి మాటు కాలువ మరమ్మతులను గత ప్రభుత్వం దత్తత గ్రామమైనా కూడా పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. లిఫ్ట నీటిని రెండు మూడు రోజుల్లో నిలిపివేయనున్నట్టు, రైతులు సాగునీరు వృథా కాకుండా పంట పొలాలలో నిలువ ఉంచుకొని జాగ్రత్త పడాలని సూచించారు. అనంతరం జన్నెపల్లి రైతులు తమ సమస్యలను తెలుపగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్సీ బద్రీ నారాయణ, ఈఈ హైమద్ జానీ, డీఈ బలరాం, ఏఈ శ్రీధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ పార్లమెంట్ బిఎల్‌పి అభ్యర్థిగా అబ్బగోని అశోక్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఎల్ఎఫ్ భాగస్వామ్య పార్టీలైన ఎంసిపిఐయు, బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి, బహుజన కమ్యూనిస్టు పార్టీ, వర్కర్స్ పార్టీ, ప్రజా పోరాట సమితిల నుంచి మొదటి జాబితాను బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ శుక్రవారం ఓంకార్ భవన్ హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బిఎల్ఎఫ్ బలపర్చిన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి అభ్యర్థిగా అబ్బగోని అశోక్‌గౌడ్‌ను ప్రకటించినట్లు బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ పేర్కొన్నారు.



పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శనివారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధులలో భాగంగా మండలానికి రూ.30లక్షల నిధులు మంజూరైనట్టు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కల్వర్ట్ నిర్మాణానికి రూ.5లక్షల నిధులతో ప్రారంభించే పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వొద్నల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మండలాభివద్ధి కుంటుపడిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు కృషితో ఎన్నో ఏండ్లుగా కలగా మిగిలిన ప్రధాన కూడలి కాల్వర్ట్, డ్రైనేజీ నిర్మాణానికి మోక్షం లభించిందని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయడానికి కృషి చేసిన శ్రీహరిరావుకు, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి మండల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, రవి కిరణ్, బిట్లింగ్ నారాయణ, సమ్మెట రవి, సిరిపురం నగేష్, సురేష్, గంగయ్య పాల్గొన్నారు.

గిరి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష 2024-25 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 22వరకు ఆన్‌లైన్‌లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తక్షశిల తెలిపారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిభా, రిజర్వేషన్ ప్రతిపాదికన ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, విద్యా, ప్రత్యేక క్రీడలు, అన్ని రంగాలలో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆరో తరగతి ప్రవేశానికి 2023-24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష నుంచి రూ.లక్ష 50వేల మించకూడదని తెలియజేశారు. 2024 మర్చి 31 నాటికి వయసు 10-13 ఏండ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆంగ్ల మద్యమం సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. గడువులోపు విద్యార్థులు ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

జనహితమే మనహితం కావాలి

- చట్ట పరిజ్ఞానం విస్తృతం చేద్దాం
- జిల్లాజడ్జి సునీత
- న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి
- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత


చెక్కును అందజేస్తున్న జిల్లా జడ్జి సునీత, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

సివిల్ దావాలను, రాజీపడదగిన క్రిమినల్ కేసులను న్యాయస్థానాల అభిమతం మేరకు రాజీపద్ధతిన పరిష్కరించడమే న్యాయసేవ సంస్థ ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కక్షిదారులనుద్దేశించి ప్రసంగించారు. చట్ట పరిజ్ఞానం జనసామాన్యానికి మరింత చేరువ కావలసిన ఆవశ్యకత ఉన్నదని అన్నారు. ఒక న్యాయపరమైన వివాదం న్యాయస్థానంలో ఉన్నప్పుడు ఒకపక్షం రాజీకోసం ప్రయత్నిస్తే మారోపక్షాన్ని ఆ దిశగా కదిలించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. న్యాయసేవల చట్టం ద్వారా ఏర్పరచిన లోక్ అదాలత్‌ను సంపూర్ణంగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. సైబర్ నేరాలలో డబ్బును కోల్పోయిన బాధితులకు త్వరితగతిన తిరిగి వారి డబ్బులు ఇప్పించడానికి కోర్టులు తమ పరిధిలో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాన్యాయపీఠాలలో ప్రజాహితమే ఇమిడి ఉన్నదని జిల్లా జడ్జి తెలిపారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ ప్రసంగిస్తు లోక్ అదాలత్‌ల విజయవంతానికి పోలీసుశాఖ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నదని తెలిపారు. న్యాయసేవలను, పోలీసు సేవలను పరిపూర్ణంగా వినియోగించుకోవాలని అన్నారు. వ్యక్తుల మధ్య వ్యక్తిగత దూషణలు, కక్షలు తద్వారా జరిగే నేరాలు వ్యవస్థకు చేటు తెస్తాయని తెలిపారు. నేరరహిత సమాజానికి, శాంతియుత సహ జీవనానికి పౌర సమాజ తోడ్పాటు చాలా అవసరమని ఆయన అన్నారు. తెలిసి, తెలియక చేసిన చిన్నచిన్న నేరాలకు కోర్టులలో జారిమానా చెల్లించడంతో సరిపోతుందని కాని అంతకు మించిన నేరాలు రుజువైతే జైలే గతని తెలిపారు. అయినా చట్టం సమాజ విశాల ప్రయోజనాల కోసం, వ్యక్తుల మధ్య సఖ్యత కోసం, కొన్ని విషయాలలో మినహాయింపులు ఇచ్చి రాజీపడదగిన క్రిమినల్ నేరాలలో ఇరుపక్షాల ఆమోదం మేరకు రాజీపద్ధతిన కేసుల పరిష్కారానికి చట్ట అనుమతులు ఉన్నాయని విశదీకరించారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో అదనపు జిల్లాజడ్జి కనకదుర్గ, న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జి కుష్బు, గోపికృష్ణ, శ్రీనివాస్‌రావు, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ వెంకటేశ్వర్, నిజామాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రాజా వెంకటరెడ్డి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్, న్యాయసేవ సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్, న్యాయవాదులు మానిక్ రాజు, రవి ప్రసాద్, అంకిత, రజిత, కృష్ణ, గోపాల్‌రావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ అవార్డులు, బ్యాంకు చెక్కుల అందజేత

లోక్ అదాలత్‌లో సివిల్ కేసులలో రాజీపద్ధతిన పరిష్కరించుకున్న కక్షిదారులకు లోక్ అదాలత్ అవార్డులు జిల్లా జడ్జి సునీత, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ అందజేశారు. మోటారు రోడ్డు ప్రమాద నష్ట పరిహార దావాలలో బాధితులకు బ్యాంకు చెక్కులను అందజేశారు.

ఎంఈఓను సస్పెండ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ, బివిఎం, పిడిఎస్‌యూ, బిపిడిఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

కామారెడ్డి మండల విద్యాశాఖ అధికారి ఎల్లయను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ విద్యార్థి మోర్చ బివిఎం రాష్ట్ర కార్యదర్శి వియం విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరుణ్, పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సురేష్, బిపిడిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ.. ఎంఈఓ పాఠశాల గర్గుల్ ఉన్నత పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వాతలు వచ్చే విధంగా తీవ్రంగా కొట్టరన్నారు. విద్యార్థులను తీవ్రంగా కొట్టిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్తే క్రమశిక్షణలో భాగంగా కొట్టారని ఉపాధ్యాయులకు వత్తాసు పలుకుతూ విద్యార్థులను హేళన చేస్తూ వాళ్లు విద్యార్థుల రౌడీల్ల ఉన్నారని ఎంఈఓ అనడం సిగ్గుచేటు అన్నారు. విద్యార్థులను కొట్టిన ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని, ప్రైయివేటు కార్పొరేట్ విద్యా సంస్థల యజమాన్యాలు ఎంఈఓ అండ దండలతో ఇష్టానుసారంగా విద్యను వ్యాపారం చేస్తున్నారన్నారు. ప్రైయివేటు కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీని అరికట్టాలని, అనుమతి లేకుండా ఇష్టాను సారంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. పలు మార్లు ఫిర్యాదు చేస్తే యజమాన్యం ఇచ్చే మామూళ్లకు వత్తాసు పలుకుతూ చర్యలు తీసుకోకుండా వారికి సపోర్ట్ చేస్తున్నారన్నారు. గతంలో అనుమతి లేదు అని పాఠశాలను మూసివేస్తే అదే పాఠశాలకు అనుమతి లేకుండానే తరగతులు నడిపించుకోవాలని ఎంఈఓ ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. శాంతినికేతన్ పాఠశాలలో విద్యార్థులను మానసికంగా హింసించినటువంటి టీచర్లపై యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఫిర్యాదు చేసిన విద్యార్థులను బెదిరిస్తున్న వారికే ఎంఈఓ మద్దతు ఇస్తున్నారనీ పేర్కొన్నారు. ఇలాంటి అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలుగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున అందోళన చేస్తామని ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులను హెచ్చరిస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో బివిఎం, జిల్లా అధ్యక్షులు ప్రసన్న, ఎస్ఎఫ్ఐ, జిల్లా నాయకులు మణికంఠ, సాయి, సందీప్, పిడిఎస్‌యూ నాయకులు ముకేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ అభినందన సభ

- బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-కంఠేశ్వర్





విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, సీఐ

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో గత నెల 25వ తేదీన నిర్వహించిన పదవ తరగతి ప్రతిభ పరీక్షలో మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ పేరుతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించి వారిలో ఉన్న భయాందోళన తొలగిస్తూ, వార్షిక పరీక్షల్లో ఉన్నతమైన మార్కులు సాధించే రకంగా అభినందన సభ నిర్వహించి వారిని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. అలాగే ఈ సంవత్సరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి ప్రతిభ పరీక్షను నిజామాబాద్ నగరంలో దాదాపు 1200 మంది విద్యార్థులు, 23 పాఠశాలల విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారని అందులో 30 మంది వరకు బహుమతులకు ఎంపికయ్యారని తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి రామారావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ నరహరి మాట్లాడుతూ.. రానున్న పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు భయాందోళనలు వదిలి ప్రశాంతతతో పరీక్షలు రాసి ఉత్తమ మార్కులు సాధించాలని అన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాలు చేయడం అభినందనీయమని తెలియజేశారు. అలాగే మండల విద్యాశాఖ అధికారి రామారావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు పోరాడుతూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు ప్రతిభా పరీక్షలు వ్యాసరచన పోటీలు క్రీడాలు లాంటివి నిర్వహిస్తూ ఒక సంపూర్ణ విద్యార్థిగా ప్రతి ఒక్క విద్యార్థిని తీర్చిదిద్దే కార్యక్రమాలు నిరంతరం కొనసాగించడం చాలా మంచి విషయం అని కొనియాడారు. అదేవిధంగా పోరాటం ద్వారానే మార్పు సాధిస్తామని తెలియజేస్తూ రానున్న పదవ తరగతి బోర్డు పరీక్షల్లో ఉన్నత మార్కులు సాధించే రకంగా కృషి చేయాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు వేణు, గణేష్, సందీప్ నగర నాయకులు బాబురావు, ఆసిఫ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


అభినందన సభలో పాల్గొన్న విద్యార్థులు తల్లిదండ్రులు

లెప్రసీ సర్వే పర్యవేక్షణ

నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలో శనివారం లెప్రసీ సర్వే కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్నటువంటి ఈ సర్వేను జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ గజానన్ పర్యవేక్షించారు. అదేవిధంగా సర్వే కార్యక్రమాన్ని విధివిధానాలను తనిఖీ చేశారు. ఏఎన్ఎంలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జరుగుతున్న పనిపట్ల సంతృప్తిని వ్యక్తపరిచారు. వారి వెంట సీనియర్ లెప్రసీ ఆఫీసర్ వామన్, ల్యాబ్ టెక్నీషియన్ రమణచారి ఉన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వేణు, ఏఎన్ఎం గంగామణి, స్రవంతి, శ్యామల, లక్ష్మి పాల్గొన్నారు.

పరీక్షలంటే భయపడొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని అంకోలి పీహెచ్‌సీ డాక్టర్ సర్పరాజ్ అన్నారు. శనివారం మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వారి మానసిక స్థైర్యాన్ని పెంచి, పరీక్షల పట్ల భయాన్ని తొగించేందుకు అవగాహన కల్పించారు. సోమవారం 18న పదో తరగతి పరీక్షలు మొదలై ఏప్రిల్ 02 వరకు జరిగే పరీక్షల పట్ల ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తమ సిబ్బంది మెడికల్ కిట్లతో క్యాంపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుభాష్, హెల్త్ అసిస్టెంట్ పవార్ ప్రేమ్ సింగ్, స్కూల్ ఇన్‌చార్జి ప్రాధానోపాధ్యాయులు సుగుణ, ఏఎన్ఎం కామేశ్వరి, ఆశ రుక్మిణి, స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ధ్యేయం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గ్రామాల్లో మౌలిక వసతుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ చట్టం ద్వారా రూ.2.80 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. మామిడిగూడ, సకరాం తండా, తదితర గ్రామాలకు బీటీ రోడ్డు, ఆశ్రమ పాఠశాలలో స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నాయకులు మెస్రం నాగానాథ్, ముకాడే ఉత్తం ఉన్నారు.

కవిత అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

నవతెలంగాణ-ఉట్నూర్

కవిత అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితను అక్రమ అరెస్టుకు నిరసనగా ఉట్నూర్ ఐబీ చౌరస్తా వద్ద రోడ్డు ఎక్కి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు రమేష్ మాట్లాడారు. అక్రమ అరెస్టుతో బయపెడితే ఎవరు భయపడేది లేదని అన్నారు. ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ నిరసనలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-బేల

మండలంలోని బేల, చెప్రాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 33 కేవీ, 11కేవీ లైన్ మరమ్మత్తు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ విషయాన్నీ విద్యుత్ వినియోగదారులు గమనించాలని విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

బిఎల్‌పి అభ్యర్థిని గెలిపించండి


మాట్లాడుతున్న సిరిగాద సిద్ధిరాములు

నవతెలంగాణ-కామారెడ్డి

బిఎల్ఎఫ్ భాగస్వామ్య పార్టీలైన ఎంసిపిఐయు, బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి, బహుజన కమ్యూనిస్టు పార్టీ, వర్కర్స్ పార్టీ, ప్రజాపోరాట సమితిల నుంచి జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సాయికృష్ణను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిగాద సిద్ధిరాములు కోరారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న బిఎల్‌టీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.వడ్ల సాయి కృష్ణ, విద్యార్థి దశ నుంచి పేద విద్యార్థుల కోసం అనేక ఉద్యమాలు నడిపారని, నిరు పేదలకు, కార్మిక పోరాటంలో పాల్గొన్నట్టు తెలిపారు.

గురుకులాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-రామారెడ్డి

సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంకు గాను 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీ ఉన్న సీట్ల భర్తీ కోసం మార్చి 23 వరకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్షలు, ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అలుగునూరు, గౌలిదొడ్డి గురుకులాల్లో 9వ తరగతి చదివే విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉన్నట్లు సూచించారు.

విద్యార్థులకు నగదు పారితోషకం


విద్యార్థులకు పారితోషికం అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న మొదటి సంవత్సర విద్యార్థులు 10వ తరగతిలో, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, మొదటి సంవత్సరంలో సాధించిన మెరిట్ ఆధారంగా 23 మంది విద్యార్థులకు రూ.10,000 నగదు పారితోషకాన్ని మలబార్ గ్రూప్ అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధుశ్రీ వాత్సవ ఒక ప్రకటనలో తెలిపారు.


కాంగ్రెస్‌తోనే సుస్థిరత సాధ్యం

నవతెలంగాణ-పిట్లం


భూమిపూజ చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ రామ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మద్దెల చెరువు గ్రామంలో మజీద్ ప్రహరి గోడ, డ్రైనేజ్ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్దెల చెరువు గ్రామంలో మైనార్టీల మజీద్‌కు రక్షణ నిమిత్తం ప్రహరీ గోడ, గ్రామంలో డ్రైనేజీ సమస్యపై గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇందుకు గాను గ్రామ ప్రజలకు డ్రైనేజీ సమస్య నిర్మూలించడానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు నిధుల నుంచి బస్టాండ్ వద్దగల మజీద్ నుంచి ఎస్సీ కాలనీ వరకు డ్రైనేజీ నిర్మించనున్నట్టు తెలిపారు. దీంతో ప్రజలకు డ్రైనేజీ సమస్య కొంతమేరకు తీరుతుందిని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుర్రి విట్టల్, నడిపి గంగారం, సాయికుమార్, శ్రీరాములు పటేల్, విట్టల్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రమేష్, హన్మాండ్లు, మోహన్, పోచయ్య, కాసిం, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాల పట్ల హర్షం



నవతెలంగాణ-భిక్కనూర్

డ్వాక్రా గ్రూప్ మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని జంగంపల్లి గ్రామంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు మహమ్మద్ షబ్బీర్‌అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నరేష్, మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం పట్ల గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యం, ప్రకాష్‌గౌడ్, బాలయ్య, ప్రవీణ్‌గౌడ్, లావణ్య, లతా, సునీత, మహేశ్వరి, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పత్తి లక్ష్మణ్ ఆధర్వంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలియజేసి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కావాలని కక్ష ధోరణిలో బిజెపి మద్యం కుంభకోణం పేరుతో అరెస్టు చేయించిందని, భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయిబాబా, ఆనంద్, శ్రీధర్, ఉదయ్, కూచిసిద్దు, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.